


# విప్పుకున్న రెక్కలు

సంసారనావ సాఫీగా, ఆనందంగా సాగాలంటే భార్యాభర్తలు 'ఒకరి కోసమే ఒకరు' అన్నట్లు జీవించాలి. అహం విడనాడాలి. ముఖ్యంగా భర్తలు గ్రహించాల్సిన సత్యమిది.

"రజూ! రజూ!" మూసి ఉన్న తలుపుల మీద బిగించిన పిడికిలి పిడిగుద్దులు వేస్తోంది. గొంతు పిడుగు శబ్దంలా ప్రతిధ్వనిస్తోంది. మూసుకుని ఉన్న·గది తలుపులు తెరుచుకోలేదు.

"రజితా! నిన్నే తలుపు తియ్." ప్రభాకర్ కంఠం మిలిటరీ అధికారి ఆజ్ఞలా ప్రతిధ్వనించింది.

సమాధానం రాలేదు.

"రజీ! తలుపులు తియ్. లేకపోతే ఈ గదికి నిప్పుపెట్టేస్తాను. లోపల మాడి మసి అవుతావు."

ఈ బెదరింపులు కూడా పనిచేయలేదు.

"ఎంత పొగరే నీకు! నాకు తిక్కరేగిందంటే... నీకు తెలుసుగా!"

"............."

"తలుపు తియ్. తీస్తావా? లేదా?"

"............"

"ఈ తలుపులు పగలగొట్టి లోపలికి రాలేననుకుంటున్నావా?"

"............"

ప్రభాకర్ నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు. అతని నాసికాపుటాలు ఆవేశంతో రైలు ఇంజనులా ఊపిరి వదులుతున్నాయి.

అతను తలుపు బాది, అరిచి, బెదరించి అలిసిపోయాడు. ఒక్కసారిగా నిస్సత్తువ వచ్చింది. ఆగ్రహం అనేది లావాలాటిది. అది ఉత్పన్నం అవగానే బయటికి ఉరకటానికి చిందులు వేస్తుంది. సందు దొరక్కపోతే ఇంకా ఉధృతం అవుతుంది. ప్రభాకర్ మనసు అలాగే ఉంది. అతని ఆగ్రహం... రజిత మీదకు విరుచుకు పడాలని. మూసిన తలుపులు అడ్డంగా ఉన్నాయి.

రజిత తన భార్య. తన చేత మెడలో తాళి కట్టించుకుని, పలుపుతో వచ్చిన గోవులా ఇంటికి వచ్చింది.

ఆమె తనను కాదని, వెళ్ళిపోతున్నానని చెప్పకుండా, కనీసం ఉత్తరం ముక్క అయినా రాయకుండా, తనకు తెలియకుండా ఇల్లు వదిలేసి వచ్చింది.

ఆమె ఈ మౌన నిష్క్రమణ అతనికి ఆవేశంతో పిచ్చి ఎక్కిస్తోంది. అతనిలో పురుషాహంకారం వేయి తలల భయంకర సర్పంలా 'బుస్'న బుసలు కొడ్తోంది.

తలుపుకు ఆనుకుని నిస్సత్తువగా నిలబడినవాడల్లా ఒక్కసారి ఆవేశకెరటంలా లేచాడు. ఉప్పెనలా విజృంభించాడు. అతని చేతులు తలుపును బాదాయి. కాళ్ళు తన్నాయి.

తలుపు విరిగి కంతలాగా మార్గం ఏర్పడింది.

అతను లోపలికి వచ్చాడు.

అతన్ని చూడగానే రజిత కూర్చున్నదల్లా లేచి నిలబడింది. ఆమె చేతిలో ఎంబ్రాయిడరీ చేస్తున్న ఫ్రేమ్ ఉంది.

సూది, దారం కుట్టువేసి పైకి లాగినట్టు ఎత్తిన చెయ్యి అలాగే ఉంది. అతను దగ్గరగా వచ్చాడు.

"నన్ను తప్పించుకోగలవా నువ్వు?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"చెప్పకుండా రావటం నీ ఇష్టమేనా?" రెట్టించాడు.

జవాబు రాలేదు.

"మాట్లాడవేం?" గద్దించాడు.

జవాబు మౌనమే అయింది.

"నిన్నే!" అతను ఆమె చేతిలో ఎంబ్రాయిడరీని చూశాడు.

"అవతల నేను అరుస్తుంటే, నువ్వు ఇక్కడ కులాసాగా గులాబీలు సృష్టిస్తున్నావా?" మెరుపులా వచ్చిన అతని చేతి విసురుకు ఆ ఎంబ్రాయిడరీ ఫ్రేమ్ బట్టతోసహా వెళ్ళి దూరంగా పడింది.

రజిత వెళ్ళి దాన్ని తీసుకోవటానికి మోకాలి మీద వంగి కూర్చుంది.

అతను వెనకే వచ్చి ఆమె జడ దొరకపుచ్చుకుని బలంగా లేపాడు.

"అబ్బా!" అంది. అతని వైపు బలవంతంగా తిరిగిన ఆమె చూసింది.

చిత్రాలు: బాలి



ఆ చూపులో భీతిలేదు.

తన నిస్సహాయతకు వణకు లేదు. ఒంటరిగా ఉన్నాను, నాకు రక్షణ లేదే అనే కంగారు లేదు. ఆ చూపుల్లో నిర్లక్ష్యం ఉంది.

అతను చెయ్యి ఎత్తి కొట్టబోతున్నాడు.

ఇంతలో శబ్దం అయింది.

అతను తిరిగి చూశాడు. పోలీసులు లోపలికి వస్తున్నారు. వారిని చూడగానే అతను ఖంగుతిన్నాడు.

"మాకు ఫోన్ చేసింది మీరేనా?" అడిగాడు పోలీసు అధికారి.



''అవును.'' రజిత గొంతు తొట్రుపాటులేకుండా పలికింది.

''మిస్టర్! మీరు ఈమెపై దౌర్జన్యం చేయటం, తలుపులు పగలగొట్టి లోపలికి రావటం, కొట్టటం... పదండి స్టేషన్‌కి.'' అతను ప్రభాకర్ చొక్కా పట్టుకొన్నాడు.

ఖంగుతిన్న ప్రభాకర్ ఏదో చెప్పబోయాడు. ''షటప్'' అన్నాడు అధికారి.

''నేను ఈమె భర్తను.'' ప్రభాకర్ ఆవేశంగా అన్నాడు.

''ఒక భర్త భార్య గదిలోకి రావాల్సిన తీరు ఇదేనా?''

అతను విరిగిన తలుపును, క్షణంక్రితం అతను ఆమె జుట్టు పట్టుకొని ఉండటం గుర్తుచేస్తూ అడిగాడు. అతని కంఠంలో వ్యంగ్యం ప్రభాకర్ మనసు మీద లాఠీదెబ్బలా ఫెడీలున తగిలింది.

రజిత ఏం జరగనట్టే వెళ్ళి దూరంగా పడిన ఎంబ్రాయిడరీ ఫ్రేమ్ తెచ్చుకుంది.

పోలీసులు ప్రభాకర్‌ను తీసుకువెళ్తుంటే ''థ్యాంక్ యు సర్'' అంది. ఆ గొంతు విని ప్రభాకర్ దెబ్బతిన్న పులిలా ఆమె వైపు తిరిగాడు. పోలీసు అధికారి అతని తలను గుమ్మం వైపు తిప్పాడు.

* * *



రాత్రి 8 గంటలు అయింది. రజిత టీవీ చూస్తోంది. ఫోన్ గణగణ మోగింది. టీవీ తగ్గించి వెళ్ళి తీసింది.

అవతల నుంచి మామగారు పరశు రామయ్య కోపంగా, ఆదుర్దాగా ''రజితా ప్రభాకర్‌ను పోలీసు స్టేషన్ నుంచి జామీను మీద ఇంటికి తీసుకువచ్చాను. నువ్వు చేసిన అవమానానికి వాడు విషం మింగాడు. హాస్పిటల్లో చావుబతుకుల మధ్య ఉన్నాడు. ఇప్పుడు నీ కసి తీరిందా?'' అన్నాడు.

రజిత ఫోన్ పెట్టేసింది. వచ్చి టీవీ పెద్దది చేసి వింటోంది.

పావుగంట తర్వాత కాలింగ్ బెల్ వినిపించింది.

టీవీ తగ్గించి వెళ్ళింది. తలుపు తెరిచింది. ఎదురుగా రజిత పినతండ్రి ఉన్నాడు.

''రజితా! నీకు తెలుసా? ప్రభాకర్ స్లీపింగ్ టాబ్లెట్స్ మింగాడు.''

రజిత మాట్లాడలేదు. ఆయన వచ్చి కూర్చున్నాడు. రజిత వచ్చి టీవీ పెద్దది చేసింది.

''ఆ వెధవ టీవీ కట్టెయ్యి'' అన్నాడు కోపంగా. రజిత వెళ్ళి వాల్యూమ్ బాగా తగ్గించింది. బొమ్మలు కనిపిస్తున్నాయి. ఆడియో తగ్గు స్వరంలో వినిపిస్తోంది. చైనా యువతి అత్యంత అద్భుతంగా జిమ్నాస్టిక్స్ చేస్తోంది.

రజిత సర్వం మర్చిపోయినదానిలా శ్రద్ధగా చూస్తోంది.

''నిన్నే.'' పెద్దగా అన్నాడు బాబాయి.

''ఊఁ.'' ఉలికిపాటుగా ఆయనవైపు తిరిగింది.

''నీకేమైనా చెవుడా? నేను ఇంతసేపు వాగిందేమిటి'' అన్నాడాయన కోపంగా.

''ఏమిటి బాబాయ్?''

''ప్రభాకర్ ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు.''

''తెలుసు.'' టీవీలో ఫామిలీ ప్లానింగ్ కార్యక్రమం వస్తోంది. రజిత వెళ్ళి టీవీ కట్టేసింది.

''తెలిసి నువ్వు ఇంత నిబ్బరంగా ఎలా ఉంటున్నావు?''

''లోకంలో ఎంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు! వారందరిని గురించి నువ్వు ఎప్పుడైనా బాధపడ్డావా బాబాయ్?''

''ఏమిటీ? అదీ, ప్రభాకర్ సంగతీ ఒకటేనా?''

''నీకు ముఖ్యమైనది నాకు కాదు. నీకు ఆదుర్దా కలిగించేది నాకు కలిగించదు.'' ఆమె జవాబు సూటిగా ఉంది.

''ప్రభాకర్ ఏమైపోయినా నీకు పట్టదా?''

పట్టదన్నట్టు తలూపింది.

''మీ ఇద్దరి పెళ్ళి చేసినవాడిని నేను.''

ఆయనకు టీ కలపటానికి ఫ్రిజ్‌లోనుంచి పాలు తీసుకొనివెళ్తున్న రజిత ఆయనవైపు తిరిగి చూసింది.

''పెళ్ళి చేసింది నువ్వే! కానీ, కలిసి బతకాల్సింది మేం. మా అండర్‌స్టాండింగ్స్ మాకుండాలి.''

''ఏదో భార్యాభర్తలన్న తర్వాత...''

''భార్యాభర్తలకు కలిసి ఉండే హక్కే కాదు, విడిపోయే హక్కు కూడా ఉంది.''

> **ఆమె చేతిలో ఎంబ్రాయిడరీ చేస్తున్న ఫ్రేమ్ ఉంది. సూది, దారం కుట్టువేసి పైకి లాగినట్టు ఎత్తిన చెయ్యి అలాగే ఉంది. అతను దగ్గరగా వచ్చాడు.**

''అమ్మో! ఎన్ని మాటలు నేర్చావే రజితా! నర్సరావుపేటలో పుట్టి, నా చేతుల మీద పెరిగిన నువ్వేనా?...'' ఆశ్చర్యంగా అన్నాడు.

''ఆగావేం? కానీ, తిట్లదండకం ప్రారంభించెయ్యి. నా చదువును తిట్టు. నా స్నేహితుల్ని తిట్టు. నేను చదివే పుస్తకాలను తిట్టు. నేను ఉద్యోగంలో చేరానే, ఆ నా ఆఫీసు వాళ్ళందరిని తిట్టు.''

''అసలు నువ్వు ఎందుకు అతన్ని వదిలి వచ్చేశావో చెప్పు.''

రజిత టీ తయారుచేస్తోంది.

''చెప్పవే రజితా.''

రజిత మాట్లాడలేదు.

''అసలు ప్రభాకర్ ఏం చేశాడు?''

రజిత వెంటనే చెప్పలేదు. ఆయన టీ తాగుతూ, రజితను చెప్పమంటూ బతిమలాడాడు. రజిత చెప్పటం ప్రారంభించింది.

''పెద్దవాడివి. నిన్ను అయోమయంలో పెట్టటం నాకిష్టంలేదు. మాకిద్దరికీ కుదరదు'' అంది.

''ఎందుకని!''

''అతనిలో ఎదుటివారిని మనిషిగా గౌరవించే, అతి మామూలు సభ్యత లేదు బాబాయ్. ప్రభాకర్‌నిచ్చి నాకు పెళ్ళి చేశావు. అతని చదువు, ఉద్యోగం, అతని కుటుంబం, అతని ప్రవర్తన నీతోపాటు నేనూ ఇష్టపడ్డాను. పెద్దవాళ్ళు పెళ్ళి చేయటం అంటే తీరంవరకూ వచ్చి పడవలోకి ఎక్కించి ఇక ఒడ్డున ఆగిపోవటమే.

తర్వాత ప్రయాణం అంతా మేం చేయాలి. ఆ ప్రయాణానికి ఒకరి మనసు ఒకరు తెలుసుకోకపోతే, ఆ ఒంటరితనం చాలా భయంకరం బాబాయ్. అది నీకు చెప్పినా అర్థంకాదు. ప్రభాకర్ అంటే నాకు చాలా ఇష్టమే. అతనికిష్టంలేదంటే ఇంత చదువుకుని, అర్హత ఉండి కూడా నేను జాబ్ చేయలేదు. మామూలు గృహిణిగా, భర్త కోసం వేచిచూస్తూ ఇంట్లో ఉండటం ఇష్టం అని తెలుసుకొని, అతను అడగకుండా, అతనిచేత చెప్పించుకోకుండా నేనే చేశాను. అతనికి

నచ్చరని నా ఫ్రెండ్స్‌ను వదులుకున్నాను: అతని స్టేటస్‌కి దీటు కారంటే, నాకెంతో ఇష్టమైన మన పాండురంగా రావుగారి అమ్మాయి సుశీలను కూడా దూరంగా ఉంచాను. 'నేను' అనేది వేరుగా కాకుండా అతనిలో ఒకటిగా కలిసిపోవాలనే తహతహతో నన్ను నేను మార్చుకున్నాను.

కానీ, ఈ 8 సంవత్సరాల వివాహజీవితంలో నాకేం దొరికింది బాబాయ్? అంతులేని ఒంటరితనం. అతను నన్ను తన ఇష్టం వచ్చినట్టు మనలే యంత్రంగా భావించాడు. నాకు అతను చేసిన పనులు నచ్చటంలేదని నేను చెబితే ఇంట్లో పెద్ద గొడవ, తిట్లు. అతని చదువు, ఆ వ్యక్తిత్వం, ఆ పెద్దమనిషితనం ఒక బురఖా. అవి భార్యను తిట్టే తిట్లేనా! తిడితే నేనేందుకు ఊరుకోవాలి?

అతను అడగకుండా నేను ఎంత ఇచ్చానో, ఆ ఇవ్వటానికి ఎంత శ్రమపడ్డానో, ఎన్ని పోగొట్టుకున్నానో అతనికి రవ్వంతకూడా తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా? మీరు ఇవి చిన్నవి అంటారు. ఇటుకలు చాలా చిన్నవే. వాటిమీదనేగా అంత పెద్ద భవంతి లేచేది! చిన్న చిన్న నమ్మకాలు, ఆనందాలే నాకిష్టం. అవే నాకు ప్రాణం. అవే నాకు కొలమానం. నేను పెద్దవేవీ అతని నుంచి ఆశించలేదు.

అతనికోసం నన్ను నేను మార్చుకోవటంలో, నా వ్యక్తిత్వానికి అడ్రసు లేకుండా చేసుకున్నాను. నాకేం దొరకలేదు. ప్రభాకర్ తను ఫారిన్ టూర్ వెళ్ళాలి కాబట్టి నాకు తోచకుండా ఉంటుందని జాబ్‌లో జాయిన్ చేయించాడు. అదే అతను నాకు చేసిన మంచి, అతనికి చెడుగా మారింది. నేను ఇన్నాళ్ళూ 'నాది' అనే జీవితం లేకుండా ప్రభాకర్ కోసం బతికాను. అతని ఇష్టాలు, అతని ఆనందాలు - అవన్నీ నామీద నుంచి వెళ్ళిపోయేవి. ఒక మనిషి కోసం అలా జీవితం అంతా అర్పణ చేయటం చాలా పొరపాటు అని తెలిసింది.

రజిత మాట్లాడలేదు. ఆయన వచ్చి కూర్చున్నాడు. రజిత వచ్చి టీవీ పెద్దది చేసింది. " ఆ వెధవ టీవీ కట్టెయ్యి" అన్నాడు కోపంగా.

నేను చేసిన పొరపాటు చక్కదిద్దుకున్నాను. నేను 'నేను'గా బతకటానికి మళ్ళీ ప్రయత్నం ప్రారంభించాను. అది అతనికి నచ్చలేదు. జాబ్ మానేయమన్నాడు. 'మానను' అన్నాను. అక్కడితో మొదలైంది. నా కష్టం ఏమిటో, నా ఇష్టం ఏమిటో గమనించని మనిషితో నేను ఎందుకు కలిసి ఉండాలి? అందుకే వచ్చేశా.

'వెళ్తున్నాం' అని ఎవరికి చెబుతాం బాబాయ్? మనకిష్టమైనవాళ్ళతో, మనం మళ్ళీ రావాలని కోరుకొని ఎదురుచూసేవాళ్ళతో. భార్య పక్కన కూర్చున్నా ఇంకో ఆనందం గురించి ఆలోచించే వ్యక్తితో కలిసి ఉండమని మీరు ఆజ్ఞాపిస్తే, భయపడటానికి నేనేం చిన్నపిల్లను కాను. నాకు కావాల్సినది దొరకనిచోట పడి ఉండాల్సిన కర్మ నాకు లేదు. అందుకే ఉద్యోగం మానలేదు.

'నాది' అనే ఇల్లు ఏర్పరచుకున్నాను. ప్రభాకర్ వచ్చి నేను కట్టుకున్న ఈ గూడు కాలితో తన్నేయాలని ప్రయత్నిస్తున్నాడు. అది అతనివల్ల నేను కానీయటం లేదు. అదీ అతని బాధ. నా బాధ ఏమిటో అతను గమనించలేదు. అతనికి కాస్త బాధకలిగేసరికి ఊరంతా గోల చేస్తున్నాడు. చెయ్యనీ. ఎంత చేస్తాడు? ఎంతసేపు చేస్తాడు? మీరంతా ఉన్నారుగా - సానుభూతి చూపించండి. అతనికి కావాల్సింది ఈ సానుభూతి అయితే, అతనికి సంతోషం కలుగుతుంది. అంతకంటే ఇంకేం కావాలి?''

''అతనివల్ల లోపం జరిగింది. కాదనను. కానీ, ఎంతయినా అతను మంచివాడే రజితా.''


''నువ్వు నాకేం సిఫార్సు చేయనవసరం లేదు. సిఫార్సులతో కాపురాలు నిలబడవు. అఘాయిత్యాలతో ప్రేమలూ బతకవు.''

రజిత టీకప్పులు తీసుకొని వంటఇంట్లోకి వెళ్ళింది.

''వస్తానమ్మా.'' ఆయన లేచాడు.

''సరే బాబాయ్.'' ముక్తసరిగా అంది.

ఆయన గుమ్మం దాటుతుంటే అక్కడ తలుపును ఆనుకుని ప్రభాకర్ నిలబడి ఉన్నాడు. అతను చాలా సుస్తీగా ఉన్నాడు. నిన్నటి అతనికి, ఈరోజు అతనికి చాలా వ్యత్యాసం






కనిపిస్తోంది.

"నువ్వా! అదేమిటి... నువ్వు ... హాస్పిటల్లో..."

"హుష్!" అతను ఆయాసంగా అన్నాడు. పెదవుల మీద వేలుంచాడు. "హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చాను. నేను రజితతో మాట్లాడాలి."

"పద. మాట్లాడదాం" అన్నాడాయన.

ప్రభాకర్ చూపుడువేలుతో "మీరు వెళ్ళండి" అన్నట్లుగా సూచించాడు.



"నేను ఒంటరిగా మాట్లాడాలి. వెళ్ళండి క్విక్" అన్నాడు.

"అంతా విన్నావా?" ఆయన అడిగాడు.

అతను తల ఊపాడు. వెళ్ళమని ఆదేశించాడు.

ఆయన వెళ్ళిపోయాడు.

రజిత వంటఇంటి తలుపులు వేసి వస్తున్నదల్లా నోట మాటరాని దానిలా నిలబడిపోయింది.

ప్రభాకర్ సోఫాలో ఒరిగిపోయినట్టు కూర్చున్నాడు. అతను నిజంగా చావుబతుకుల మధ్య ఊగిసలాడుతున్న మనిషిలా ఉన్నాడు. ముఖం నల్లగా కమిలిపోయింది. దవడలు పీక్కుపోయాయి. కళ్ళు లోపలికి పోయినాయి. చేతులు, కాళ్ళు శక్తి లేనట్టు వేలాడుతున్నాయి.

"రజితా!" ఆ పిలుపులో అధికారం లేదు. ఆర్తి ఉంది. "రజీ! అయామ్ సారీ. నీకు నేను క్షమాపణ చెప్పాలి. అది చెప్పకుండానే నా ప్రాణం పోతుందేమోననిపించి వచ్చేశాను. అయామ్ సారీ. నీ ప్రేమతో నీకు రెట్టింపు ఆనందం ఇవ్వాల్సినవాడిని, అహంతో దొంగలా దోచుకున్నాను. నువ్వు వెళ్ళిపోయిన తర్వాతగాని నా నిషా దిగిరాలేదు. ఇప్పుడు.... ఇప్పుడు... ఇంటికి తిరిగి రమ్మనమని అడగటానికి రాలేదు. నేను చేసిన తప్పులు నిన్ను దూరం చేశాయని తెలిసింది అని చెప్పటానికి వచ్చాను. అయామ్ సారీ." అతను వెళ్ళటానికి లేచాడు. ఒళ్ళు తూలింది. రజిత గబాల్న వచ్చి పట్టుకుంది. "థ్యాంక్ యూ, థ్యాంక్ యూ!" అంటూనే అతను ఏడ్చేశాడు.

రజిత అతన్ని తీసుకువచ్చి సోఫాలో కూర్చోపెట్టింది. దిండు తెచ్చి తలకింద పెట్టింది.

"రజితా! ఐ లవ్ యూ." అతను ఆమెను పట్టుకొని అనేశాడు. "ప్లీజ్. నన్ను వదిలేయవద్దు. ప్లీజ్, నీ చూపుల్లో నిర్లక్ష్యం నన్ను కత్తిలా తూట్లు పొడుస్తోంది. నేనంటే అంత ప్రేమ నిండిన కళ్ళలో ఎంత నిర్లక్ష్యం! అప్పుడే నా తప్పు తెలిసింది. నీ దగ్గరికి రాలేక పోయాను." రజిత అతని తలమీద చెయ్యి వేసింది. అతను ఆమెను హత్తుకుపోయాడు.

రజిత అతన్ని వెనక్కి వాల్చి పడుకోపెట్టి, వెళ్ళి మామగారికి ఫోన్ చేసింది.

"ప్రభాకర్ నా దగ్గరికి వచ్చాడు. కంగారుపడకండి" అంది. డాక్టర్‌కి ఫోన్ చేసి, అడ్రస్ చెప్పి, ఇంటికి రమ్మనమని చెప్పింది.

"రజితా!"-రెట్టింపు ఆర్తితో పిలిచాడు. చేయి సాచాడు. రజిత దగ్గరికి వచ్చింది. "పది నిమిషాల్లో డాక్టరు వస్తారు. కంగారుపడ వద్దు" అంది.

"రజితా!" ఆమె చేతిని పట్టుకొని అందులోకి తల దించు కున్నాడు. "నన్ను క్షమించావు కదూ!" ఆమె మాట్లాడలేదు.

"రజితా!" ఆమె చేతిని పట్టుకొని అందులోకి తల దించుకున్నాడు. "నన్ను క్షమించావు కదూ!"

ఆమె మాట్లాడలేదు. "చెప్పు." అడిగాడు.

"............."

"చెప్పు. ప్లీజ్."

"క్షమాపణలు జీవితాలను దగ్గరికి తీసుకురావచ్చునేమోకానీ, ఒకటి చేయలేవు" అంది.

ఆ మాటలు సూటిగా ఉన్నాయి. ఆమె నమ్మిన నగ్నసత్యం అతనికి చూపిస్తున్నట్టుగా ఉంది. అతను ఆమెను వదిలేయబోయాడు. ఆగిపోయాడు. మరింతగా చెంపని ఆమె చేతిమీద ఆనించుకున్నాడు.

"యస్. కానీ, కానీ దగ్గరగా ఉంటే ఒకటి అవటానికి ప్రయత్నించటానికి అవకాశం ఉంటుందికదూ" అన్నాడు.

రజిత మాట్లాడలేదు. ఆ క్షణం ఆమె అంతర్యం చాలా హాయిగా ఉంది. మోయలేని ఒక భారం నుంచి ఆమె బంధవిముక్తురాలు అయినట్టుగా ఉంది. ఆమె మనసులో ఇదివరకు ఎన్నడూ ఎరుగని ఆనందం రెక్కలు విప్పుకోసాగింది. ■